క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న ఎల్లమ్మ, పక్కన కూరగాయల అలంకరణలో అమ్మవారు

ఆదోని అర్బన్: ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం శ్రీ రేణుకాఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామున పంచామృతాభిషేకం, నిమ్మకాయల హారం, పూలు, వెండి, బంగారు అలంకారం, నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఉత్సవమూర్తిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఆదోని చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

బెట్ట నుంచి పైర్లను కాపాడుకోవాలి

గోనెగండ్ల: ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితుల్లో రైతులు పంటలను కాపాడుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత సూచించారు. వారు మంగళవారం మాట్లాడుతూ పత్తి పైరుకు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములను ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకుంటే బెట్ట నుంచి పది రోజుల పాటు తట్టుకుంటుందని చెప్పారు. అలాగే మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతిని గమనించామని, ఈ పురుగు లార్వాలు ఆకుల సుడులలో ఉండి అంకురాన్ని తిని పంటను దెబ్బతీస్తాయని చెప్పారు. ఈ పురుగు నివారణకు ఏమామెక్టిన్ బెంజోఏట్ 0.3 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకొని మొక్క ఆకుల సుడులలో నాలుగు చుక్కలు వేయాలి. ఇలా చేస్తే పంటలను కాపాడుకోవచ్చునని రైతులకు తెలియజేశారు.

బాధిత కుటుంబానికి చేయూత



వంట సామగ్రి అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 11వ వార్డు కటికె వీధిలో గుడిసెలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కటిక రఫీక్ కుటుంబానికి మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ చేయూతనందించారు. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.25 వేల విలువైన వంట సామగ్రిని మంగళవారం బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్ చైర్మన్ రియాజ్‌అహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు వాహిద్, ఖాశింబేగ్, శివప్రసాద్, షాబుద్దీన్, సుధాకర్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ వడ్డె రంగన్న, గట్టుభాజ తదితరులు ఉన్నారు.

గర్భిణులకు అన్నదానం



ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న క్లబ్ సభ్యులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రికి మంగళవారం స్కానింగ్ పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు మార్నింగ్ ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా 9వ తేదీన స్కానింగ్ పరీక్షలకు వచ్చే గర్భిణులకు అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వాసుపత్రికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భవతులు ఇబ్బందులు పడకుండా తమకు తోచిన విధంగా అన్నదానం చేస్తున్నామని, భోజనంతో పాటు స్వీట్ అందిస్తున్నట్లు తెలిపారు.

రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: రోటరీ క్లబ్ ద్వారా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కేఆర్ నట్‌రాజ్‌రెడ్డి, సుధాకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ అసుపత్రి ఆవరణలో 400 మంది గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, వాటి విలువలు, పిల్లల సంరక్షణ, పెంపకం తదితర అంశాల గురించి వైద్యాధికారులచే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున, రోటరీక్లబ్ సహాయ కార్యదర్శి కె.బీరప్ప, క్లబ్ పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు పద్మనాభరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సభ్యులు న్యాయవాది గురురాజారావు, మాచాని వెంకటేష్, ఇంజినీర్ వెంకటేశ్వర్లు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై నిరంతర నిఘా



పట్టుబడిన మద్యం, బైక్‌ను చూపుతున్న సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, సెబ్ సీఐ, ఎస్‌ఐలు

ఎమ్మిగనూరురూరల్: జిల్లాలో కర్ణాటక మద్యం అక్రమ తరలింపుపై నిరంతర నిఘా ఉంటుందని సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని స్థానిక సెబ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా, తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టి బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడు మాదిగ మల్లేష్ కర్ణాటక నుంచి దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి మద్యం తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఏపీ 40 ఏహెచ్ 7544 నంబర్ గల యాక్సిస్ బైక్‌ను సీజ్ చేసి 5 బాక్సుల్లోని 480 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.55 వేలు ఉంటుందని చెప్పారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా వెంటనే తన సెల్ నంబర్ 94409 02579 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. తనిఖీల్లో సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్‌ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ లింగ ప్రసాద్, గోపాల్, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

సెబ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యం, నాటుసారాను మంగళవారం వెంకటగిరి గ్రామానికి వెళ్లే దారిలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. సెబ్ సర్కిల్ పరిధిలోని పట్టుబడిన మద్యంను ఉన్నతాధికారుల ఆదేశాల మేదరకు ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఏడు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 13.08 లీటర్ల నాటుసారా, ఆరు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 521.19 లీటర్ల కర్ణాటక మద్యం ప్యాకెట్లను రోడ్డుపై వేసి వ్యాన్‌తో తొక్కించి ధ్వంసం చేశామన్నారు. కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఏఎస్పీతో పాటు సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్‌ఐ సత్యానారయణ, సిబ్బంది ఉన్నారు.



మద్యం ప్యాకెట్లను వ్యాన్‌తో తొక్కించి ధ్వంసం చేస్తున్న దృశ్యం

పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న రూరల్ సీఐ మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: పోలీసులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయం ఆవరణలో లిటిల్ ఫ్లక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్‌లోని పోలీసులకు ఉచిత హోమియో మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసులకు ఉచితంగా హోమియో క్యాంప్ నిర్వహించి, మందులు ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో వయస్సుకు సంబంధం లేకుండా అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. లిటిల్ ఫ్లక్ ఫౌండర్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, వెలెన్స్ హోమియో క్లినిక్ ఇంటర్నేషనల్ సీఈఓ డాక్టర్ అరుణ్‌కుమార్, టౌన్ ఎస్‌ఐ రమేష్‌బాబు, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, టౌన్, ట్రాఫిక్, రూరల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ వేడుక



ఎడ్ల బండిపై జగన్నాథ ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న గ్రామస్తులు

నందవరం: మండలంలోని ముగతి గ్రామంలో జగన్నాథ వేడుక వైభవంగా జరిగింది. మంగళవారం వేడుకలో భాగంగా ముగతి శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం అర్చకుడు సదానంద స్వామి, గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి నేతృత్వంలో ఊరేగింపు చేపట్టారు. శ్రీకృష్ణుడు, బలరాముడు, సుభద్ర మూర్తుల విగ్రహాలను ఎడ్ల బండిపై ఊరేగించారు. గ్రామం నుంచి ఎమ్మిగనూరు పట్టణం వరకు ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడుతున్న జాతీయ సహాయ కార్యదర్శి ఎం.రాజశేఖర్

ఆదోని అర్బన్: ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహాయ కార్యదర్శి ఎం.రాజశేఖర్ పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ పునర్నిర్మాణమే ధ్యేయంగా ఏబీవీపీ పనిచేస్తుందన్నారు. 1949లో ఢిల్లీ యూనివర్సిటీలో కేవలం నలుగురితో ప్రారంభమై నేడు లక్షల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా పేరుగాంచిందన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో జూలై 9న జాతీయ విద్యార్థి దినోత్సవంగా దేశవ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. ఏబీవీపీ జాతీయ సమస్యలపై, విద్యారంగ సమస్యలపై, ప్రకృతి వైపరీత్యాల సమయంలో, కరోనా ఆపద సమయంలోనూ ఎప్పటికప్పుడు మేమున్నామంటూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థి సంఘం నాయకులు ఉమామహేష్, వీరేష్, గోవింద్, బండా ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

ఆదోని టౌన్: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వాంతులు, విరేచనాలు తదితర వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు సిరాజ్‌బేగం, హర్షిక, మహేష్‌బాబు సూచించారు. ఈ మేరకు మంగళవారం శంకర్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వార్డు సచివాలయ ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రజలకు క్షయవ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, గళ్లలో రక్తపు చారలు, ఆకలి, బరువు తగ్గడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉన్నట్లయితే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు పొందాలన్నారు. క్షయవ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడే మందులు, నెలకు రూ.500 నగదును అందిస్తారని చెప్పారు. దగ్గడం, తుమ్మినప్పుడు మోచేయి అడ్డుపెట్టుకోవాలన్నారు. మాస్క్ తప్పనిసరిగా ధరించాలని, మనిషి మనిషికి రెండు మీటర్ల దూరం పాటించాలన్నారు. ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేయరాదని, ఉమ్మితే మట్టిని కప్పాలన్నారు. అర్బన్‌హెల్త్ సెంటర్ సిబ్బంది, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు, ఆశావర్కర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దకడబూరు: మండల కేంద్రంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జనార్దన్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరై వారి గ్రామాలలో నెలకొన్న సమస్యలను తెలియజేయాలన్నారు. గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలు ఎంతవరకు పూర్తయ్యాయో చర్చించి మండల అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అందించాలని ఎంపీడీఓ కోరారు.

టీడీపీ దాడులు ఆపాలి



మాట్లాడుతున్న పోలకల్ మునిస్వామి

ఆదోని టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 35 రోజులు కావొస్తోందని, ఆయా పార్టీల నాయకులు అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై విచ్చలవిడిగా దాడులు చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోలకల్ మునిస్వామి ఆరోపించారు. ఆయన మంగళవారం స్థానిక భీమాస్ ఫంక్షన్ హాలులో విలేకరులతో మాట్లాడారు. ఇకపై దాడులు ఆపాలని, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్ జగన్ పాలనలో ఇలాంటి దాడులు ఎప్పుడూ చూడలేదు, వినలేదన్నారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా టీడీపీ దాడుల్లో ఐదుగురు వైఎస్సార్‌సీపీ నాయకులు చనిపోయినట్లు తెలిసిందన్నారు. పెన్షన్ల పంపిణీలో పాత జన్మభూమి కమిటీల పెత్తనం చెలరేగిపోతుందని ఆరోపించారు. పింఛన్ల పంపిణీలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా టీడీపీ శ్రేణులు పాల్గొంటూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని విమర్శలు చేశారు. నీతి, నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలే తప్పా ఇలాంటి అక్రమ దాడులు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. విభజన హామీలు, ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంపై దృష్టి సారించాలన్నారు. ప్రజాసేవ చేయాలే తప్పా ఇలాంటి దాడులతో ప్రజలను ఎంతోకాలం భయపెట్టలేరని, త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: కడుపునొప్పి తాళలేక కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన రంజాన్ అనే వ్యక్తి మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని రోజుల నుంచి కడుపునొప్పి ఉండేదని, చికిత్స పొందినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న రంజాన్‌ను బంధువులు వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రంజాన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

బకాయిలను విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్, పట్టణ అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. మంగళవారం భోజన విరామ సమయంలో ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ జాన్ విక్టర్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ వంటివి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే వాటిని విడుదల చేయాలని కోరారు. ఎస్టీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు, జిల్లా నాయకులు లోక్యనాయక్, ప్రసాద్, ప్రహ్లాద్, ఉరుకుందప్ప, విజయ్, మారయ్య, సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో వ్యర్థాలను తొలగించాలి



ఎల్లెల్సీలో పేరుకుపోయిన వ్యర్థాలను చూపుతున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సహాయ కార్యదర్శి సమీవుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ నాయకులు ఎల్లెల్సీ కాలువను పరిశీలించి మాట్లాడారు. తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదల చేయనుండడంతో ఆ నీటినే పట్టణ వాసులకు తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారని తెలిపారు. ప్రస్తుతం కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని, కాలువకు నీరు విడుదలైతే కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. తద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. తాగునీటి అవసరాల కోసం కాలువకు విడుదల చేసే నీరు కలుషితం కాకుండా మున్సిపల్, ఎల్లెల్సీ అధికారులు సత్వరం ఎల్లెల్సీలో వ్యర్థాలను తొలగించే పనులు చేపట్టాలని కోరారు. నాయకులు బజారి, కేసీ జబ్బార్, తిమ్మగురుడు, వీరేష్, విజయేంద్ర, మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల్లేని కళాశాలల గుర్తింపు రద్దుచేయాలి



ఆర్‌యూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కనీస వసతుల్లేని డిగ్రీ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శేఖర్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాయలసీమ యునివర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. పట్టణంలోని వైష్ణవి, నలంద, సిద్దార్థ డిగ్రీ కళాశాలల్లో అద్దె భవనాలు, రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనిపై యునివర్సిటీ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. కొన్ని కళాశాలల్లో తగిన విద్యార్హతలు లేని అధ్యాపకులతో విద్యాబోధనలు కొనసాగిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల నుంచి అడ్మిషన్ ఫీజులు అధికంగా వసూలు చేయడమేగాకుండా చదువులు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు అందించకుండా ఫీజుల కోసం వేధిస్తున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా ఆయా కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా సర్వే దినోత్సవం



రెవెన్యూ కార్యాలయంలో వేడుక చేసుకుంటున్న ఉద్యోగులు

నందవరం: మండల పరిధిలోని రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం సర్వే దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ వహాబ్ నేతృత్వంలో సర్వే ఉద్యోగుల సంఘం వ్యవస్థాపకుడు పట్టాభి రామయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి ఘటించారు. ఆయన కృషితోనే సర్వే ఉద్యోగుల సంక్షేమం సాధ్యపడిందని తహసీల్దార్ గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ అక్బర్ బాషా, ఆర్ఐ జెర్మియా, సీనియర్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.

కన్నడ విద్యార్థులకు సువర్ణావకాశం

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కన్నడ మీడియం విద్యార్థులకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలో సీబీఎస్ఈ ఇంగ్లిష్ మీడియంలో గాకుండా కన్నడ భాషలో పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తూ విద్యా శాఖ కమిషనర్ సూర్యకుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ ఉత్తర్వులు రావడానికి ఏపీటీఎఫ్‌తో పాటు గ్రామ ప్రజలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. అందరి పోరాట ఫలితమే నేడు విద్యార్థులకు మేలు జరిగిందని, అయితే తెలుగు, ఇంగ్లిష్, కన్నడ, ఉర్దూ మీడియంలు ఉన్న ఈ పాఠశాలలో ఇద్దరు హెచ్‌ఎంలను నియమించాలని, ఆయా మీడియంలను వేర్వేరుగా చూపుతూ పోస్టులు మంజూరు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి విన్నవించినట్లు హృదయరాజు తెలిపారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం



కస్తూర్బా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా డెమో శ్రీనివాసులు,



ఆరోగ్య కేంద్రంలో ఆడపిల్ల తల్లిని సన్మానిస్తున్న అధికారులు

కృష్ణగిరి: సమాజంలో మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని జిల్లా డెమో (డిస్ట్రిక్ ఎడ్యుకేషనల్ అండ్ మీడియా అధికారి) శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కృష్ణగిరి ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా విద్యాలయంలో వైద్యాధికారి వరప్రసాద్‌తో కలిసి బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బందికి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో నేటికీ ఆడపిల్లలంటే వివక్షతో భ్రూణహత్యలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకునేందుకు బేటీ బచావో పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఆడపిల్లల తల్లులను సన్మానించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ ఇందిరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, పీహెచ్ఎన్ అలివేలమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ చైతన్యస్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

మద్దికెర: కలుషిత నీటితో డయేరియా బారిన పడే అవకాశం ఉందని.. ప్రజలు తాగునీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో డయేరియా క్యాంపెయిన్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది బడి పిల్లలకు చేతుల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య సిబ్బంది తాగునీటి వనరుల్లో నీటి నాణ్యతను పరీక్ష చేయాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి మద్దికెరలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, కృష్ణమ్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు.



మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పండ్ల తోటల సాగుతో లాభాలు



రైతులతో మాట్లాడుతున్న ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ

దేవనకొండ: రైతులు పండ్ల తోటల పెంపకం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణ దత్తత గ్రామమైన కప్పట్రాళ్లలో తానా స్త్రీ శక్తి భవనంలో ట్రీస్ ఆధ్వర్యంలో రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ మాట్లాడుతూ ఐదంతస్తుల విధానంలో పండ్ల తోటల సాగువైపు రైతులు అడుగులు వేయాలన్నారు. రాబోయే రోజుల్లో కప్పట్రాళ్ల గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ ప్రాంతం పండ్లతోటల పెంపకానికి అనువైనదని, కప్పట్రాళ్ల, బండగట్టు, నెల్లిబండ, కరివేముల, ఈదులదేవరబండ గ్రామాల్లోని రైతులను పండ్లతోటల సాగువైపు నడిపిస్తున్నామన్నారు. రిసోర్స్‌పర్సన్ చింతమాను రవికుమార్, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించండి



పెద్దకడబూరు బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

పెద్దకడబూరు: మండలంలోని బడి ఈడు పిల్లలను బడులకు పంపాలని మండల విద్యాధికారి రామమూర్తి పిలుపునిచ్చారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక (మెయిన్) పాఠశాల నుంచి విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమక్షంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక బస్టాండ్ ఆవరణలో విద్యార్థుల చేత మానవ హారంగా ఏర్పడి విద్య ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో బడి ఈడు పిల్లలందరినీ బడులకు పంపించాలన్నారు. పిల్లలతో వ్యవసాయ, కూలీ పనులు చేయించడం, పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.